## నీమ్జ్‌పై శాసన సభలో మాట్లాడిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో ఏర్పాటు అవుతున్న జాతీయ పారిశ్రామిక పెట్టుబడుల తయారీ సంస్థ (నీమ్జ్)పై గురువారం శాసన సభ సమావేశంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రస్తావించారు. నీమ్జ్ ఏర్పాటు ప్రాంతంలో ఇప్పటికే గత బిఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు చేశారని, పలు కంపెనీలు స్థాపించేందుకు నాటి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయన్నారు. నీమ్జ్ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సభలో వినతి చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొందరు ఎస్సీ, బిసిలకు ఇళ్ల స్థలాల కొరకు పట్టాలు ఇవ్వగా అవి నీమ్జ్ ప్రాంతంలో ఉన్నాయని, లబ్దిదారులకు ఎలాంటి నోటీసులు అందించకుండా రాత్రికి రాత్రి అధికారులు లబ్దిదారలు కష్టపడి వేసుకున్న షెడ్లను, ఇండ్లను కూలగొట్టారని సభ దృష్టికి తీసుకుపోయామన్నారు. లబ్దిదారులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సభలో వినిపించినట్లు ఎమ్మెల్యే వివరించారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## బంజారాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

**-పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి**

**గజ్వేల్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** పోడు భూములను సాగుచేస్తూ సంచార జీవనం సాగిస్తున్న బంజారాలను ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా దుకుంటుందని పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజారాలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్, నైజాంలాంటి నియంత పాలన నుండి బంజారాల విముక్తి కోసం పోరాడిన గొప్ప వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని, ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలను జరుపుకోవడం శుభపరిణామమన్నారు. బంజారాల జీవనోపాధి కోసం ఇందిరా గాంధీ పాలనలోనే వ్యవసాయ భూములు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌చారి, గ్రామ మాజీ ఉపసర్పంచ్ రమేష్, గంగులోత్ జయరాం, అజ్మీర శంకర్, అజ్మీర రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.



సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిద్దిపేట ఏసీపీ జి.మధు

## మత్తుపదార్థాలపై నిఘా ఏర్పాటు చేయాలి

**నూతన ఏసిపి మధుకి సిపి అనురాధ సూచన**

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సిద్దిపేట డివిజన్ నూతన ఏసీపీగా జి.మధు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏసీపీగా పనిచేసిన సురేందర్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సిద్దిపేట ఏసీపీగా బదిలీపై వచ్చిన జి.మధు పదవీబాధ్యతలు చేపట్టి సీపీ కార్యాలయంలో సీపీ డా॥అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన జి.మధును అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిద్దిపేట డివిజన్ పరిధిలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అసాంఘీక కార్యక్రమాలకు జరగకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిడిఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణా జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మత్తుపదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు.

**ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సుమన్‌కుమార్**

సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీగా ఎం.సుమన్‌కుమార్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ కార్యాలయంలో సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని సీపీ అనురాధ సూచించారు. ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజీవ్ రహదారి, నేషనల్ హైవే రోడ్లలో బ్లాక్ స్పాట్‌ను సందర్శించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

## మల్లన్న స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న మధ్యప్రదేశ్ సిఎం, కేంద్ర మంత్రి



మొక్కులు చెల్లించుకుంటున్న మధ్యప్రదేశ్ సిఎం, కేంద్ర మంత్రి

**కొమురవెల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మధ్య ప్రదేశ్ సిఎం డా॥మోహన్ యాదవ్, కేంద్ర సంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి లక్ష్మణ్‌లు గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలయ సాంప్రదాయం ప్రకారం అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. వారి వెంట జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్, దక్షిణ మధ్య రైల్వే అధికారి అరుణ్‌కుమార్‌జయం, అలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీ, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, బిజెపి నాయకులు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట మున్సిపల్ కమిషనర్‌గా దేవేందర్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :**



జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసిన మున్సిపల్ కమిషనర్

రామాయంపేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎం.దేవేందర్ నియాకమయ్యారు. గురువారం ఆయన మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి మున్సిపాలిటీ నుండి బదిలీపై వచ్చిన ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేష్‌లను జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయన వెంట స్థానిక మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ పీఆర్ఓ కాలేరు ప్రసాద్‌రావులు ఉన్నారు. ఇప్పటిదాకా ఇక్కడ ఇంచార్జి మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహించిన రామాయంపేట ఎంపిడివో ఉమాదేవి ఇటీవల సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

## నేటి రాజకీయ సమ్మెకు బిఎంఎస్ దూరం

**గజ్వేల్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** నేడు జరగబోయే రాజకీయ కార్మిక సమ్మెకు భారతీయ మజ్దూర్ సంఘ్ దూరంగా ఉంటుందని ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు టి.నర్సింహారెడ్డి, కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ సభ్యుడు సల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలంలు తెలిపారు. గురువారం బిఎంఎస్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నేడు జరగబోయే సమ్మె కార్మికులు, ప్రజల కోసం కాదని స్వలాభం కోసమని, అవకాశవాద రాజకీయాల కోసం చేస్తున్నందున బిఎంఎస్ దూరంగా ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**
టీజింగ్‌కు గురైన మహిళలు, అమ్మాయిలు, పిల్లలు, లైంగిక వేధింపులకు గురైన అమ్మాయిలకు, మహిళలకు, అత్తింటి వారి ఆగడాల బారిన పడిన మహిళలు, గృహ హింసకు గురైన మహిళల కోసం భరోసా కేంద్రంలో మహిళలకు రక్షణ కోసం, రాత్రి నిద్రించేందుకు వసతి కోసం, కౌన్సిలింగ్ కోసం, న్యాయ సహాయం కోసం, అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించడం కోసం ఆధునిక హంగులతో నూతన భవనాన్ని పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, స్థానిక ఎమ్మెల్యే డా. రోహిత్‌రావులతో కలిసి 2 కోట్ల రూపాయలతో జిల్లా కేంద్రంలో నిర్మించిన భరోసా కేంద్రాన్ని, షీటీమ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్లాండ్ ఫార్మ సీఎస్ఆర్ ఫండ్స్ సౌజన్యంతో అధునాతన భరోసా కేంద్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 2022 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 135 కేసులు నమోదు అయ్యాయని, వారికి సుమారు 27 లక్షల పైచిలుకు ఆర్థిక సహాయం చేశామన్నారు. కేసు నమోదు అయినప్పుడు ఆర్థిక సహాయం చేయాలన్నారు. చివరగా జడ్జిమెంట్ వచ్చినప్పుడు సంపూర్ణ ఆర్థిక మద్ధతు ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. భరోసా కేంద్రంలో శారీరకంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురైన, అత్యాచారాలకు గురైన బాధితులకు తక్షణం అండగా నిలిచేందుకు, పోక్సో కేసులలో మహిళలకు, పిల్లలకు స్వాంతన చేకూర్చడానికి కౌన్సిలింగ్, రిహాబిలేషన్ సెంటర్‌గా ఈ భరోసా కేంద్రం ద్వారా పోలీసులు, మానసిక నిపుణుల ద్వారా బాధిత మహిళలకు, పిల్లలకు అండగా నిలిచేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. బాధిత మహిళలకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తాయన్నారు. మానసిక వేదనకు గురికాకుండా కాపాడే విధంగా ఈ భరోసా సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. భరోసా కేంద్రాలు లేని జిల్లాల్లో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐజీ రెమో రాజేశ్వరి, జిల్లా ఎస్పీ డా. బాలస్వామి, డీఎంహెచ్‌వో చందునాయక్, జిల్లా సంక్షేమాధికారి బ్రహ్మాజీ, మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, గ్లాండ్ ఫార్మ ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

# 'గౌరవెల్లి' కోసం మాట్లాడితే ఎదురుదాడులకు దిగుతున్నారు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**
మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చిస్తే పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టును పూర్తి చేయకుండా తమపైనే ఎదురుదాడులకు దిగుతున్నారని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని బంజారా భవన్‌లో గిరిజనుల ఆరాధ్యదైవం అయిన శ్రీసంత్ సేవాలాల్‌మహారాజ్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాలకు హాజరయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని గిరిజనుల అభివృద్ది కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో పదేళ్ల క్రితం హుస్నాబాద్‌కు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని పూర్తిచేస్తానని హామీ ఇచ్చి విస్మరించడంతో పాటు ఈవిషయాన్ని గుర్తు చేస్తే ఆ పార్టీ నాయకులు తమపై ఎదురుదాడులకు దిగుతున్నారన్నారు. వారు భయపెడితే భయపడడానికి తామేమి వారి వద్ద పని చేసే పాలేర్లం కాదన్నారు. తప్పు చేసిన వారే భయపడతారని స్పష్టం చేశారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపింది కాంగ్రెస్ పార్టీ, ఇందిరా గాంధీఅని వారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశ పెట్టిన రిజర్వేషన్‌ల వల్లే నేడు గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. అనంతరం గిరిజన మహిళలతో కలసి సాంప్రదాయ నృత్యాలు చేసి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులతో పాటు ఆర్డీవొ బెన్‌షాలోమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, ప్రొఫెసర్ వీరన్న నాయక్, ఎంపిపిలు లకావత్ మానససుభాష్, మాలోతు లక్ష్మీభీలునాయక్, డిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, నాయకులు అక్కు శ్రీనివాస్, వీరన్ననాయక్, తిరుపతినాయక్, బురుగు కిష్టస్వామి, వెన్న రాజు, బురుగు సతీష్, జవహర్‌లాల్‌నాయక్, గుగులోతు శివరాజ్, భీమా సాహెబ్, భాస్కర్‌నాయక్, గుగులోతు రాజునాయక్ తో పాటు కౌన్సిలర్లు, అయిలేష్‌యాదవ్, అయా శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## బిసి కులగణన తీర్మానం పట్ల హర్షం

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** బిసి కులగనన తీర్మానాన్ని గురువారం శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశ పెట్టడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు బిసి సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఈ తీర్మాణం చేయకుండా గత పాలకులు బిసిలను ఆర్థికంగా, రజకీయంగా తొక్కేశారన్నారు. తీర్మానం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేష్ యాదవ్, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు పెరుమండ్ల నర్సాగౌడ్, మేకల వీరన్నయాదవ్, అక్కు శ్రీనివాస్, కుమారస్వామి, ప్రసాద్, భగవాన్‌సింగ్, వెంకటయ్య, బాలరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు



అనిరుద్‌శర్మ కుటుంబసభ్యులను ఓదారుస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

## గుండెపోటుతో విద్యార్థి మృతి

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బ్రాహ్మణ బంజరుపల్లి గ్రామానికి చెందిన కొరిడె అనిరుద్‌శర్మ పాండిచ్చేరి యూనివర్సిటీలో బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ నాలుగవ సంవత్సరం చదువుతున్నారు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం అతని మృతదేహాన్ని బంజరపల్లి గ్రామానికి తీసుకురాగా ఈ విషయం తెలుసుకున్న అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గ్రామానికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, గ్రామ సర్పంచ్ రాములు, గ్రామస్తులు ఉన్నారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

**జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ఇంటర్మీడియట్ వార్షికపరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానుండడంతో జిల్లాలో పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జనరల్, వొకేషనల్ గ్రూపులకు చెందిన 20949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 9831 మంది మొదటి సంవత్సరం, 11118 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. జిల్లాలో 44 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను సకాలంలో చేర్చేలా ఆర్టీసి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జవాబుపత్రాలను ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాల నుంచి జిల్లా డిఆర్‌డిసీకి తరలించే విషయంలో పోస్టల్‌శాఖ పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్యప్రకాష్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ కాశీనాథ్, డీసీపీ మల్లారెడ్డి, పోస్టల్ అధికారి శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఈ మహేష్‌కుమార్, ఆర్టీసి డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ హైపవర్ కమిటీ సభ్యులు మంగరాజు, డీఈసీ సభ్యులు భూపాల్‌రాజు, దేవస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు

## కాళేశ్వరం అవినీతిలో హరీష్‌రావుకు భాగం

**డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్**

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** లక్షల కోట్ల అవినీతితో కాళేశ్వరం నిర్మిస్తే కృంగిన ప్రాజెక్టుని రిపేర్ చేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్ అన్నారు. సిద్దిపేటలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతిలో హరీష్‌రావుకు భాగం ఉందని ఆరోపించారు. త్వరలోనే అయన జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డికి ప్రాజెక్టు రిపేర్ చేయడం చేతకాకపోతే రాజీనామా చేయాలనడం హాస్యస్పదంగా ఉందన్నారు. కోట్ల రూపాయాల ప్రజాధనాన్ని మాజీ సిఎం, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావులు వృధాచేసి దోచుకున్నారని అరోపించారు. సొంత నియోజకవర్గంలో రంగనాయకసాగర్, అన్నపూర్ణసాగ్ ఉన్నప్పటికీ నేటికి ఎందుకు కాలువలు తవ్వించలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇతర దర్యాప్తు సంస్థలు త్వరలో నివేదికలు ఇస్తారని అవినీతిలో హరీష్‌రావు ఇరుక్కుపోవడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీనాయకులు మీసం మహేందర్, సందబోయిన పర్శరాములు, కొరిమి రాజు, మీసం రాజు, ఉడుత నాగరాజు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్**



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. గురువారం ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల ముగింపు సభను అక్కన్నపేట మండలంలోని అంతకపేటలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు వారి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతీ ఇంట్లో తడి, పొడి చెత్తను వేరు చేస్తూ గ్రామ పంచాయతీ సిబ్బందకి అందించడంతో పాటు ప్రతీ ఒక్కరు కనీసం ఒక్క మొక్కను నాటి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించే విధంగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జయరాం, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపివో కవికుమార్, ఎంపిటిసి కంది రజితశ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సర్వర్‌పాషా, స్పెషల్ ఆఫీసర్ మహేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యార్థులకు తీవ్ర అన్యాయం

**-విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పంగ మోహన్‌బాబు**

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని బిఆర్ఎస్‌వి మండల అధ్యక్షుడు పంగ మోహన్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.8 శాతం 21,389 నిధులు కేటాయించడం విద్యార్థులను అవమానపరిచినట్లే అన్నారు. బడ్జెట్‌లో గతంకంటే నేడు మెరుగుగా ఉండాలి కానీ నేటికంటే గతమే బాగుండె అనే తీరును గుర్తుచేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందిస్తే ఇప్పుడు పథకాలు అన్నీ రద్దు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానిది పద్ధతి కాదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నిధులు కేటాయించలేదన్నారు. మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ కట్టిస్తామని చెప్పి కేవలం రూ.500 కోట్లతో 570 స్కూళ్ళు ఎలా నిర్మిస్తారో చెప్పాలన్నారు. 900 గురుకులాలు 1500 కోట్లతో ఎలా నిర్మిస్తారని, యూనివర్సిటీలకు 2వేల కోట్లతో నూతన అభివృద్ధి చేస్తామని చెప్పి 500 కోట్లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి విద్య కోసం 18 నుండి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పేద విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.



పులి దాడిలో గాయపడిన దూడ

## కొల్చారం మండలంలో చిరుత పులి సంచారం

**కొల్చారం, ఫిబ్రవరి 15 ప్రభాతార్త :** మండలంలో చిరుతపులి సంచరిస్తుంది. దీనితో ప్రజలు భయం గుప్పిట్లో జీవిస్తున్నారు. గురువారం మండల పరిధిలోని దేవుని వెంకటాపూర్ గ్రామంలో పశువుల పాకలో అర్ధరాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో దూడపై చితరు పులి దాడి చేసి గాయపరిచింది. దూడ అదే గ్రామానికి చెందిన ఎల్లయోళ్ల వెంకటేశంకు చెందింది. అటుగా వస్తున్న స్థానికుల ద్విచక్రవాహనం శబ్దం విని పారిపోయినట్లుగా స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అధికారులు ఈ విషయంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు ఎప్పుడు జరగకుండా చూసుకోవాలని బాధితులు, గ్రామ ప్రజలు కోరారు. అటవీ ప్రాంత అధికారులు చిరుత పులిని గుర్తించి పట్టుకోవాలని కోరారు.

# రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

### కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న పబ్బతి ప్రభాకర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ న్యాయ్‌యాత్రలో భాగంగా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్వామినాథన్ కమిటీ సిఫారసుపై మొట్టమొదటి సంతకం చేస్తామని రాహుల్‌గాంధీ తెలపడం రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకుందని మెదక్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతులపై కన్నెర చేయడమే కాకుండా రైతులను చిత్రహింసలు పెడుతూ రైతుల ఉసురు పోసుకుంటున్న నరేంద్రమోడీ, అమిత్‌షాలు గంగలో కొట్టుకుపోతారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా రైతులకు కనీసం మద్దతు ధరను ప్రకటించడమే కాకుండా 2014 సంవత్సరం నుండి మద్దతు ధర 2203 చెల్లించడంతో రైతులు 800 రూపాయలు ప్రతి సీజన్‌కు నష్టపోతున్నారని ఆయన మండిపడ్డారు. అధికారంలోఉన్న బీజేపీ ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులనుపట్టించుకోవడం విఫలమయ్యారని విమర్శించారు. అలాగే ఆనాటి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, బీజేపీ పార్టీతో రహస్య ఒప్పందాలు చేసుకొని రైతులను నట్టేట ముంచిన ఘనత ఆనాటి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందని ఆయన ఎద్దేవ చేశారు. ప్రతి క్వింటాలుకు కాంగ్రెస్ పార్టీ 500 రూపాయలు బోనస్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పామని ఆయన గుర్తు చేశారు. కనీస మద్దతు ధరకు చట్టభద్రత కల్పించాలని హర్యాన రైతులపై దాదాపు 200 కిమీ.ల లోపు అడ్డుగా గోడలు కట్టడం, రైతుల మీదికి టియర్ గ్యాస్ ప్రయోగించడం, బాష్ప వాయువు విసరడం, రైతులపై బీజేపీ ప్రభుత్వం కన్నెర చేసి రైతులను పొట్టన పెట్టుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించినట్లు మల్లి ఖార్జున ఖర్గే ఆధ్వర్యంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే స్వామినాథన్ కమిటీపై మొదటి సంతకం చేస్తామని చెప్పడం సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మిఠాయిలు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. అలాగే రైతులపై జరిపిన దాడులకు నిరసనగా కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌లో కిసాన్ సెల్ పాల్గొంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఎంపీపీ చందన ప్రశాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు గూడూరి ఆంజనేయులు, మెదక్ మండల అధ్యక్షులు శంకర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హఫీజ్ మోల్సాబ్, బొజ్జ పవన్, దాయర రవి, శ్రీనివాస్‌చౌదరి, నాగిరెడ్డి, అక్బర్, సూఫిలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నరసింహులపల్లె గ్రామస్థులు

## ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలి

**బెజ్జంకి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతారం గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు ఇచ్చి అనుమతులను వెంటనే రద్దు చేయాలని పోతారం గ్రామానికి కూత వేటు దూరంలో ఉన్న నరసింహుల పల్లె గ్రామస్తులు గురువారం తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయడంవల్ల భూగర్భ జలాలు దెబ్బతిని మానవాళికి, మూగజీవాలకు చావును కొనితెచ్చుకున్నట్లు అవుతుందన్నారు. పోతారం గ్రామ పంచాయతీ నుంచి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి విద్యార్థి ప్రణాళికతో ముందుకు సాగాలి

**బెజ్జంకి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి బంగారుభవిష్యత్‌ను నిర్మించుకోవడానికి ముందస్తు ప్రణాళిక వేసుకోవాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ సర్టిఫైడ్ ట్రైనర్ మంద జనార్ధన్ అన్నారు. గురువారం స్వేరోస నెటవర్క్స్ జిల్లా అధ్యక్షులు ఉప్పులేటి బాబు ఆధ్వర్యంలో మండలంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాల విద్యార్థులకు మానసిక, సామాజిక స్పృహవంటి పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే దశ నుంచే ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని గొప్ప గొప్ప మహనీయుల చరిత్రలను నెమరువేసుకోవాలని మహనీయులను అదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో విజయం సాధించాలన్నారు. అనంతరం మంద జనార్ధన్‌ను ఘనంగా సత్కరించారు. సదస్సులో పాఠశాల ఇంచార్జి బాలయ్య, బాలికల పాఠశాల ఇంచార్జి నిర్మల, బాలుర పాఠశాల ఇంచార్జి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ గురువారం మున్సిపల్ అధికారులతో కలసి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్‌సిసి, కంపోస్టు షెడ్డు, నర్సరీ, ఎల్లమ్మ చెరువు, నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ బిల్డింగ్ పనులు,ఎఫ్ఎస్‌టిపిలను పరిశీలించారు.అనంతరం ఎల్లమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సాంఘిక దురాచారాలకు ప్రజలు దూరంగా ఉండాలి

### ప్రత్యేక పాలన అధికారి వేణుగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సాంఘీక దురాచారాలకు ప్రజలు దూరంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, మండల ప్రజా పరిషత్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పొట్లపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దురాచారాల గురించి వివరించడంతోపాటు ఈనెల 7 నుండి 14 వరకు జరిగిన ప్రత్యేక పారిశుధ్యం పనులను వివరించారు.ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సరోజనతో పాటు కార్యదర్శి పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ కృష్ణారెడ్డిని సన్మానించిన పలువురు నాయకులు



ఎస్ఐ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బెజ్జంకి మండల నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జె.కృష్ణారెడ్డిని గురువారం మండల రెడ్డి జెఏసి అధ్యక్షులు ముక్కిస తిరుపతిరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు దీటి బాలనర్సు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డిలు, వివిధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అయా సంఘాల నాయకులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నర్సయ్య

**గజ్వేల్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** జోగులాంబ గద్వాల్ జిల్లాలోని అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన గోల్కొండ నర్సయ్య బదిలీపై గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా గురువారం గజ్వేల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని, పట్టణంలోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటానని పేర్కొన్నారు. మున్సిపాలిటీ ప్రజలు తనకు సహకరించాలని ఈ సందర్భంగా తెలిపారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**అక్కన్నపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** బిఆర్ఎస్‌వి రాష్ట్ర కార్యదర్శి సూరంపల్లి పర్శరాములు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ సోషల్‌మీడియా అధ్యక్షులు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సంఘం సభ్యులతో కలసి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

## కాంగ్రెస్ సేవాదళ్ దుబ్బాక అధ్యక్షుడిగా మదాసు రాములుగౌడ్

**తొగుట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** దుబ్బాక కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షులుగా మాదాసు రాములుగౌడ్‌ను నియమిస్తూ గురువారం గాంధీ భవన్‌లో సేవాదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ నియామక పత్రాన్ని అందజేశారు. గతంలో రాములుగౌడ్ తిమ్మక్కపల్లి సర్పంచ్‌గా, 20 ఏళ్ల సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా పని చేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు జితేందర్‌కు, పదవి రావడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## క్రైస్తవులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐజాక్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** హైదరాబాద్‌కు సమీపంగా ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలో క్రైస్తవ మందిరంలో చొరబడి వారిపై దాడి చేసిన దుండగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఐజాక్ డిమాండ్ చేశారు.గురువారం పట్టణంలో వారిపై జరిగిన సమావేశంలో వారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.స్వతంత్ర్య దేశంలో ప్రతీ వ్యక్తికి స్వేచ్ఛ ఉందని,కొందరు ప్రజాస్వామ్యాన్ని కాలదన్నుతున్నారని మండిపడ్డారు.వారి దాడిలో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.ఈ విషయంపై ఈనెల 17వ తేదీన హుస్నాబాద్‌లోని క్రైస్తవులంతా కలసి శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సాల్మన్, డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంతర్‌రెడ్డిని కలిసిన మధు ముదిరాజ్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో చేరిన నీలం మధు ముదిరాజ్ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాపూర్వకంగా కలిశారు. తెలంగాణ అసెంబ్లీలో రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీస్సులు తిసుకున్నారు. ఈ సందర్భంగా కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమను అందించి, పూల బోకే ఇచ్చి ఘనంగా సత్కరించారు. నీలం మధు చేరికను రేవంత్‌రెడ్డి స్వాగతంచారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తూ, అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ అధినాయకత్వం ఆదేశాలకు అనుగుణంగా సైనికునిగా పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి పాటుపడుతామని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి రాహుల్ గాంధీకి బహుమానంగా ఇస్తామని పేర్కొన్నారు. నీలం మధుతో పాటు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వేం. నరేందర్‌రెడ్డి, రోహిన్ రెడ్డి, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంత్ పేవాలాల్ మహరాజ్ భోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**నర్సాపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు గిరిజనులు ఆరాధ్య దైవమైన సంత్ పేవాలాల్ మహరాజ్ భోధనలను ఆచరించాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్‌లో శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బంజారాలు అంబేద్కర్ చౌరస్తా నుండి శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జై సేవాలాల్ మహరాజ్, జై జై జగదాంభ మాతా అంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ ముఖ్యఅతితులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు శ్రీ సంత్‌సేవాలాల్ మహరాజ్‌కు, జగదాంభమాతాకు పూజలు నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి విజయశేఖర్‌రెడ్డి, ఎంపిపి జ్యోతి సురేశ్ నాయక్, జిల్లా అధికారి జేమ్లా నాయక్,ఎంఈవో బుచ్యానాయక్, ఎంపిటీసీ స:ధ్యారాణి చత్రునాయక్, గిరిజన నాయకులు సామ్యానాయక్, రాంచందర్ నాయక్,రాజేశ్‌నాయక్, శివాజీనాయక్, రాము నాయక్, అమర్‌సింగ్ నాయక్, ఎల్ శ్రీనివాస్ జాదవ్,ధన్‌సింగ్ నాయక్,చెన్నా నాయక్,శ్రీనివాస్‌నాయక్, కమలాపూల్‌సింగ్ నాయక్,రాంసింగ్‌నాయక్, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, బోగ చంద్ర శేఖర్, జ్ఞానేశ్వర్‌గుప్త,షేక్ హుస్సేన్, గినిరిజనులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని కలిసిన బిఆర్ఎస్ నాయకులు

**నర్సాపూర్,ఫిబ్రవరి 15.ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణానికి నూతనంగా బదిలీ పై వచ్చిన ఎస్ఐ పుష్పరాజ్‌ను గురువారం బిఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహ్మద్ అబుబాయ్, సింగాయిపల్లి గోపి లు ఎస్ఐ పుష్పరాజ్ ను మర్యాధ పూర్వకంగా కలిశారు ఈసందర్భంగా ఎస్ఐ పుష్పరాజ్ ను శాలూవాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలి మృతి

**నర్సాపూర్, ఫిబ్రవరి 15.ప్రభాతవార్త:** ఆర్టీసి బస్సు ఢీకొని ఒక యాచకురాలు మృతి చెందిన సంఘటన నర్సాపూర్‌లో గురువారం జరిగింది.ఎస్ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం... నర్సాపూర్‌లెపి సునీతాలక్ష్మారెడ్డి కాలనీ కి చెందిన సంకు దుర్గమ్మ(45) బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంది. రోజు మాదిరిగానే బుధవారం బిక్షాటకు వెళ్తున్నానని కుటంభ సభ్యులకు తెలిపి బయటకు వెళ్లిందని తెలిపారు. నర్సాపూర్‌లోని మెదక్ రోడ్డులోగల హమ్‌సఫర్ హోటల్ వద్ద రోడ్డు దాటుతుండగా మెదక్ నుండి నర్సాపూర్ వస్తున్న ఏపి23జడ్ 0075 నెంబర్‌గల మెదక్ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు డ్రైవర్ తన బస్సును అతివేగంగా నడుపుకుంటూ వచ్చిరోడ్డు దాటుతున్న సంకు దుర్గమ్మను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. బస్సు నడుపుతున్న డ్రైవర్ పేరు శ్రీనివాస్, మెదక్ జిల్లా కేంద్రం దుర్గాకాలనీకి చెందిన వ్యక్తి అని తెలిపారు. బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం మూలంగానే తన తల్లి మృతి చెందిందని మృతురాలి కుమారుడు సంకు విజయ్ పోలీస్‌స్టేషన్ లో పిర్యాధు చేయడం జరిగింది.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.

## నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

### టిఎస్ఐఐసి ఆధ్వర్యంలో రెస్క్యూ కమిటీ ఏర్పాటు

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేష్‌తో కలిసి పటాన్‌చెరు మండలం పాశమైలారం ఐలా భవనంలో ఐలా ప్రతినిధులు, టీఎస్ఐఐసీ పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపక, కార్మిక వైద్య, ఆరోగ్య తదితర శాఖల అధికారులతో సమన్వయ సవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మంగళవారం రాత్రి సాలిబరీస్ పరిశ్రమలో రియాక్టర్ పేలి ప్రమాదం జరిగినప్పుడు ఐలా తరుపున ఏ విధమైన చర్యలు తీసుకున్నారు ? ఆయా శాఖ అధికారులు ఏ విధంగా రెస్పాండ్ అయ్యారు? ఏ విధమైన చర్యలు తీసుకున్నారు? ప్రమాదం జరగడానికి గల కారణాలు ఎంటీ? ఆయా విషయాలపై కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఫైర్ సెఫ్టీ మేజర్స్ లేని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న కంపెనిలను మూసివేయాలన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ అన్ని కంపెనీలను తనిఖీచేసి, పూర్తి నివేదికను అందచేయాలన్నారు. కార్మికులకు ఎవైనా సమస్యలుంటే పరిష్కరించేలా లేబర్ గివెన్స్ మెకానిజం ఏర్పాటు చేయాలని, వాటిని కార్మిక, టీఎస్ఐఐసీ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జడ్ ఎంటీఐఐసీ ఆధ్వర్యంలో ఐలా,అనుబంధ శాఖల అధికారులతో రెస్క్యూ కమిటీ ఏర్పాటు చేసి ఎవరేవరు ఏం చేయాలన్నా విధులను పేర్కొనాలని సూచించారు. సంబంధిత కమిటీ అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి ఫైర్ సెఫ్టీ తదితర నిబంధనలు పాటిస్తున్నాయా లేదా పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలను మూసివేయాలన్నారు. పరిశ్రమకు సంబంధించిన పూర్తి వివరాలను, ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారు, భవన సెట్ బ్యాక్, కార్మిక సంక్షేమంకు తీసుకుంటున్న వివరాలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సి న కంపెని యజమాని, అధికారుల వివరాలు, ఫోన్ నెంబర్లను కంపెని ముందు గోడకు డిస్‌ప్లే చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ కట్టని కంపేనిలను మూసివేయించాలని, టాక్స్ కట్టిన తరువాతనే ఓపెన్ చేయాలని టిఎస్ఐఐసి అధికారులకు సూచించారు. ఆయా పరిశ్రమలు పిసిబి నిబంధనల మేరకు పనిచేసేలా చూడాలని, ప్రజల ప్రాణాలకు హాని కల్పించే విధంగా ఉల్లంఘనలు జరుగుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని పిసిబి అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తున్న పరిశ్రమల యజమానులపై కేసులను నమోదు చేయాలన్నారు. లైసెన్సు, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు కలెక్టర్, ఎస్పీ ఆయా అధికారుల బృందం మంగళవారం రాత్రి ప్రమాదం జరిగిన సాలిబరీస్ పరిశ్రమను పరిశీలించారు. వైటాల్, వెంకల్ కెమికల్ ఫ్యాక్టరీ, అరబిందో పరిశ్రమలను తనిఖీ చేశారు. అరబిందో పరిశ్రమలో ఫైర్ సేఫ్టీ నిబంధనలకు సంబంధించి సర్‌ప్రైజ్ మాక్ డ్రిల్ చేయించి పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘనలు గమనించిన పరిశ్రమలపై తక్షణమే పీసీబి,రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశించారు. పరిశ్రమ కాలుష్యం, చెరువులోకి వదులుతున్న సంబంధిత కంపెనీపై చర్యలు తీసుకోవాలని పిసిబి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రూపేష్, రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, ఆయా అనుబంధ శాఖల అధికారులు, ఐలా ప్రతినిధులు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనం ఎత్తిన మైనంపల్లి

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషిచేయాలని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం మండల పరిధి చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి తండా,కామారం తండాలలో నిర్వహించిన సేవాలాల్ జయంతీ ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనం,పల్లకి సేవలలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, సొసైటి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీసీ చైర్మన్ గంగా నరేందర్, నాయకులు రంగారావు, యాదవరావు, సిహెచ్ జనార్ధన్, రాజాసింగ్, ప్రభాకర్, రాంచందర్, సంజీవ్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## సురభి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**నంగునూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సురభి మల్టీ స్పెషాలిటి హాస్పిటల్, సురభి మెడికల్ కళాశాల మిట్టపల్లి అధ్వర్యంలో మండల పరిధిలోని నర్మేట గ్రామంలోని కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో దేశిరెడ్డి, సురభి హాస్పిటల్ పిఆర్ఓ పర్శరాములు మాట్లాడుతూ సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. 450 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అపరేషన్ అవసరం ఉన్న వారిని హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మ, సురభి అసు పత్రి మార్కెటింగ్ ఇంచార్జి చరణ్, డి.రాజు, 15 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

# సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలిస్తే ఉద్యమం చేపడతాం


మాట్లాడుతున్న బిఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగం నాయకులు

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలిస్తే ఉద్యమం చేపడతామని బిఆర్ఎస్‌వి విద్యార్థి,యువజన విభాగం నాయకులు మెరుగు మహేష్, యాదగిరి, రజినికాంద్‌రెడ్డి, శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం వారు సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. కొడంగల్‌కు వెటర్నరీ కళాశాల తరలింపుపై సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు వైఖరిఏంటో వెల్లడించాలన్నారు. కొడంగల్‌కు కొత్తగా వెటర్నరీ కళాశాలను మంజూరు చేసుకోవాలని సిద్దిపేట నుంచి తరలిస్తే చూస్తూ ఉరుకోమన్నారు. సిద్దిపేటకు వచ్చిన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తీసుకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కొడంగల్‌కు కళాశాలను తరలించడం సిద్దిపేటకు అన్యాయం చేయడమేనని తెలిపారు. సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు వెటర్నరీకళాశాలను మంజూరు చేస్తే దానిని కొడంగల్‌కు తరలించాలని సిఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిద్దిపేటలో మనుషుల, పంటల, పశువుల వైద్యులను తయారుచేసే విద్యాలయాలు, కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుకే దక్కుతుందన్నారు. కొడంగల్‌కు సిద్దిపేట వెటర్నరీ కళాశాలను తరలిస్తే ఉద్యమం తీవ్రతరడం చేయడం తోపాటు పార్లమెంట్ ఎన్నికల్లో అడుగడుగున నిలదీస్తామన్నారు. సమావేశంలో మహిపాల్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రమేష్, బెల్లంకొండ వెంకట్, రాము, సాయి చరణ్‌గౌడ్, శీను, రాజు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తున్న విద్యార్థులు

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**రాయపోల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.మండల పరిధిలోని రాంసాగర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురువారం ఒక రోజు ఉపాధ్యాయులుగా విధులను నిర్వహించారు.ప్రతిరోజు ఉపాధ్యాయులు నిర్వర్తించే బాధ్యతలను విద్యార్థులు ఒకరోజు నిర్వహించారు. డీఈఓగా హర్షిత, మండల విద్యాధికారిగా అభినయ్, ప్రధానోపాధ్యాయులుగా శ్రీవల్లిక, ఉపాధ్యాయులుగా భరత్, భరణి, మారితిలు వ్యవహంచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివలింగం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధించడం వలన వారిలో క్రమశిక్షణ, సృజనాత్మక, నాయకత్వ లక్షణాలు పెంపొందించబడుతాయని అన్నారు.ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించిన విద్యార్థులు తోటి విద్యార్థుల ముందు ప్రతిభను ప్రదర్శించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేసారు.

**మర్కుక్ జెడ్‌పిహెచ్ఎస్‌లో...**



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

**మర్కుక్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరోజు పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వీకరించి ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధనలు చేసి తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ స్వయం పాలనలో జిల్లా కలెక్టర్‌గా సంజయ్ సింగ్, డిఈఓగా అఖిల, ఎంఈఓగా సాహితి,డిప్యూటీగా యశ్విత, ఎంఎన్ఓగా దివ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా నీలం భానుప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులుగా 45 మంది విద్యార్థులు తమ విధులు నిర్వహించారు. స్వయం పాలనలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణారావు, నరహరి, ప్రసాద్, భూజాత, వందన, పద్మారెడ్డి, నాగేశ్వరరావు, విద్యాధర్‌రెడ్డి, సిద్దయ్య, కృష్ణ, భ్రమరాంభ, సంతోష, రజిని, మునీర్, రాములు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**కొమురవెల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రసూలాబాద్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఎంపిపిలో గురువారం మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్, పచ్చిమడ్ల స్వాతిల అర్థిక సహాయంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే మంచిగా చదువుకోవాలన్నారు. చదువుతోనే కుటుంబాలలో వెలుగులునిండుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం యనమల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహరాజ్ సేవలు మరువలేనివి

### -మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి


సేవాలాల్ మహరాజ్ జయంతిలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్ గ్రామాల్లో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా గురువారం ఆర్ అండ్ ఆర్ కాలనీ నుండి గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బంజారాల అభ్యున్నతి కోసం సేవాలాల్ మహరాజ్ కృషి ఎంతో చేశారని, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలను గుర్తించి ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బంజారాలకు పోడు భూములకు పట్టాలు అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో సైతం మిగిలిన వారికి కూడా పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్, పల్లెపహాడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బంజారాలకు ఆధ్యాత్మిక గురువు సేవాలాల్‌మహరాజ్

### మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా గిరిజన బిడ్డలకు మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సేవాలాల్ మహరాజ్ ప్రజలను బాహ్య ప్రపంచం నుండి రక్షించడానికి పోరాడి, దేశ వ్యాప్తంగా లంబాడిలు, గిరిజనులకు అండగా నిలిచారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బంజారాలకు సేవాలాల్ అత్యాత్మిక గురువుగా, అరాధ్యదైవంగా తీర్చిదిద్దారన్నారు. బిఆర్ఎస్ పార్టీ హయాంలో గిరిజనులకు పెద్దపీత వేశామని గిరిజనుల తండాలను గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రెడ్ చేసి గిరిజన భవన్ నిర్మాణంకు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

## రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కెసిఆర్‌కు లేదు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే అర్హత స్థాయి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ సముద్రాల గ్రామశాఖ అధ్యక్షులు పున్న సత్తయ్య అన్నారు.గురువారం సముద్రాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నల్లగొండ జిల్లాలో జరిగిన బిఆర్ఎస్ బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ ప్రజా ప్రయోజనార్థం వారు నిర్మించిన ప్రాజెక్టును మేడి గడ్డ బొందల గడ్డా అని విమర్శించడం సిగ్గుచేటన్నారు.ప్రాజెక్టు నిర్మాణంలో రీడిజైన్ పైరుతో వేలకోట్ల దుర్వినియోగం చేశారని మండిపడ్డారు.వారు విమర్శించిన ప్రాజెక్టును వారే విమర్శించుకోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు.కెసిఆర్ ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.ఈ సమావేశంలో మహిళా అధ్యక్షురాలు చేర్యాల లావణ్య,ఉపాధ్యక్షురాలు కొండని సంగీత,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గద్దం రాజశేఖర్‌రెడ్డి,గట్టు శ్రీనివాస్,చేర్యాల తిరుపతి,పిల్లి మహేందర్,ఇసంపల్లి తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు పొలంలో పడి యువకుడి మృతి

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు పొలం గట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన భూంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని మోతెలో గురువారం చోటు చేసుకుంది. పోలీసు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బైండ్ల శ్రీకాంత్(36) తన వ్యవసాయ పొలానికి వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెంది గాలించగా గురువారం తమ వరి పొలంలో పడి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ కోరారు.



పుల్వామ అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

## పుల్వామ అమరవీరులకు ఘన నివాళులు

**మనూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండలంలోని రాయిపల్లిలో పుల్వామ అమరవీరులకు భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలోని శిక్షణ కేంద్రం నుంచి బస్టాండ్ వరకు శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ బాధ్యులు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రదాడిలో అమరులైన జవాన్లను స్మరిస్తూ నివాళులు అర్పించామన్నారు. అమరుల సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ కొ-ఆర్డినేటర్ జహంగీర్, పవన్, అసద్, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు, గ్రామ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని కంకర మిషన్లపై చర్యలు తీసుకోవాలి



కంకరమిషన్లను తొలగించాలని అధికారికి ఫిర్యాదు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** నిబంధనలు పాటించని కంకర మిషన్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని కలెక్టర్ కార్యాలయంలో ఏఓ కుమినికి ఆయన వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని హత్నూరలో నిర్వహిస్తున్న కంకర క్రషర్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నదన్నారు. సర్వే నంబర్ 116లో ప్రభుత్వం కేటాయించిన భూమి కంటే అధికంగా తవ్వకాలు చేశారిన విచారం వ్యక్తం చేశారు. కనీస లోతు కంటే అధికరంగా లోతులో తవ్వకాలు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నిబంధనలకు నీళ్లొదిలిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సైతం ఫిర్యాదు చేశామని అయినా అధికారులు తగు చర్యలు తీసుకోలేని విచారం వ్యక్తం చేశారు.

## కక్కరవాడ గ్రామ తాజా మాజీ సర్పంచ్‌కు సన్మానం



కక్కరవాడ తాజీ మాజీ సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండలంలోని కక్కరవాడ గ్రామంలో పంచాయితీ తాజా మాజీ సర్పంచ్, వార్డుసభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. తాజా మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి సేవలను ఈ సందర్భంగా గ్రామస్థులతో పాటు పంచాయితీ ప్రత్యేక అధికారి వెంకటేశం, పంచాయితీ కార్యదర్శి ఆనందం కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నర్సింలు, గోపాల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శశికాంత్, శ్రీకాంత్‌రెడ్డి, రజాక్, నవీన్, పంచాయితీ కార్మికులు నర్సింలు, ఏవన్ పాల్గొన్నారు.

## సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కృషి : మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

**పాపన్నపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. గురువారం సంత్ సేవాలాల్ మహారాజన 285వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో హన్మంత్‌రావు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హన్మంత్‌రావు మాట్లాడుతూ సేవాలాల్ ఆశయాలు గొప్పవని కొనియాడారు. ఆలయం వద్ద సిసి రోడ్డు నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ మండలం ముంగి గ్రామంలోని ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, బాపురెడ్డి, జీవన్‌రెడ్డి, కిష్టయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర కృషితోనే విజయాలు సాధ్యం



కిక్ బాక్సింగ్‌లో మెడల్ సాధించి విద్యార్థిని అభినందిస్తున్న వైస్ చైర్మన్, ప్రిన్సిపాల్

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** నిరంతర కృషితోనే విజయాలు సాధ్యమని ఎమ్మెన్నార్ ఎడ్యుకేషన్ ట్రస్టు వైస్ చైర్మన్ రవివర్మ, ప్రిన్సిపాల్ నాగజ్యోతి అన్నారు. మండలంలోని ఫసల్‌వాది గ్రామ శివారు లోగల ఎంఎన్ఆర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎం నిఖిల్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ ఓపెన్ ఛాంపియన్ షిప్ అండర్ 16 విభాగం, 32 కేజిల పోటీల్లో పాల్గొని పాయింట్ ఫైట్, కిక్ లైట్ విభాగాలు రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు వైస్ చైర్మన్ రవి వర్మ, ప్రిన్సిపాల్ నాగజ్యోతిలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన క్రీడాకారుడు ఎం నిఖిల్‌ను సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు కార్పొరేటర్ చేయూత

**సంగారెడ్డి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు సూర్యపేట జిల్లా చింతలపాలెంల జరిగే 33వ సబ్‌జూనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన సంగారెడ్డి జిల్లా క్రీడాకారులకు రామచంద్రాపురం డివిజన్ భారతీ నగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి తన వంతు సహకారం అందించారు. క్రీడాకారులకు తన స్వంత నిధులతో టి షార్టులు, షూలు బహుకరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, జిల్లా కబడ్డి అసోసియేషన్ అధ్యక్షులు ముక్తార్ జానీ, మాజీ అధ్యక్షులు ఎల్లయ్య, నారాయణ గౌడ్, రాకేష్, శ్యామ్ పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న గోవింద్ మహారాజ్



మనూర్ హాస్టల్‌లో విద్యార్థులు...



ముంగి తండాలో బిజెపి నేతలు...



కంగ్టి మండలంలో శ్యామ్‌రావుమహారాజ్ ఆధ్వర్యంలో



ఖేడ్‌లో...



ఝరాసంగంలో బంజరా భవలో...



ఉమ్మడి వెల్దుర్తి మండలంలో...



కొల్చారం మండలంలో...

# ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం జహీరాబాద్ పట్టణంలో బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బంజారా భవన్‌లో జండావిష్కరణ, మమాభోగ్ బండార్ పూజలు నిర్వహించారు. భవాని మందిరం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో డిసిసిబి మాజీ చైర్మన్, బిజెపి నాయకులు ఎం జైపాల్‌రెడ్డి పాల్గొని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని భవాని మందిరం నుంచి జాతీయ రహదారి మీదుగా తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్, హౌజింగ్ బోర్డు కాలనీలోని బంజార భవన్ వరకు గిరిజనులు నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా భవన్‌లో ఉత్సవ కమిటీ అధ్యక్షులు ప్రేమ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వక్తలు సేవాలాల్ సమాజ ఉద్దరణకు చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో గోవింద్‌మహారాజ్, మాజీ జడ్పీటిసిసభ్యులు కిషన్‌రావుపవార్, టిబేస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీ రాంరాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చవాన్, డివిజన్ అధ్యక్షులు తుకారామ్ చవాన్, గౌరవ అధ్యక్షులు హీరురాథోడ్, మాజీ సర్పంచ్‌లు కేసు సింగ్‌రాథోడ్, శంకర్‌పవార్, ఉమేష్‌లాల్ రాథోడ్, గోపాల్ భానోత్, కిషన్, గోపాల్‌జాదవ్, సేవాలాల్ బంజారా సొసైటీ అధ్యక్షులు మోతిరామ్ రాథోడ్, ఎబిఎస్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ పవార్, బంజారా నాయకులు పాండు రాథోడ్, రామ్ నాయక్, ఎంఈఓలు మారుతి, శ్రీనివాస్, జైసింగ్ చవాన్, దేవి సింగ్ రాథోడ్, హీరా లాల్ చవాన్ సంజయ్ పవార్, ప్రేమ్‌సింగ్, రాజు, జిఎస్ఎస్ రఘునాథ్, రవీందర్ చవాన్, రాజు పవార్, రవి రాథోడ్, ఎస్టి సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, రాజు భానోత్, భీమ్‌రావు, భిక్కునాయక్, పాండు పాల్గొన్నారు.

**మనూర్ హాస్టల్‌లో...**

**మనూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండల కేంద్రం లోని మనూర్ సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో గురువారం సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి హాస్టల్ వార్డెన్ రాజిరెడ్డి పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**ముంగి తండాలో...**

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండలంలోని మంగి తండాలో గురువారం గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సద్గురు సేవాలాల్‌మహారాజ్ జయంతిని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరుపుకున్నారు. బిజెపి మండల అధ్యక్షులు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయంలోని సేవాలాల్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్వి నాయక్, రాహుల్, సక్కు లాల్, శివాజీ రాథోడ్, విష్ణు పాల్గొన్నారు.

**కంగ్టి మండలంలో...**

**కంగ్టి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మండలంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా తండాల్లోని గుడి మందిరాల వద్ద బోగ్‌భండర్ నిర్వహించి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన పెద్దలు మాట్లాడుతూ ప్రతి గిరిజనులు సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు. కాగా గిరిజన యువతీ యువకులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ముకుందనాయక్ తండా, రాజారామ్ తండా, రామ్ సింగ్ తండా, జీర్గి తండా, బీంరా తండా, సాద తండా, గిరిజనులు ఆయా తండాలవాసులు పాల్గొన్నారు.

**ఖేడ్‌లో...**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి నివాసంలో సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బోగ్‌భండార్ కార్యక్రమం నిర్వహించారు. నారాయణఖేడ్ మండలపరిధి లోని ఆయా గిరిజన తండాల్లో జయంతి వేడుకలను ఘనంగా జరుకున్నారు. గురువారం నారాయణఖేడ్‌లో డీసీసీ జనరల్ సెక్రటరీ పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గిరిజన సోదరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాంచందర్‌చౌహాన్, గిరిధర్‌చౌహాన్, సర్దార్, గోవింద్ నాయ్తక్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఝరాసంగంలో...**

**ఝరాసంగం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు ఆయా తండాల్లో గురువారం గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. మండల స్థాయిలో బంజార భవన్‌ను నిర్మించాలని ఎంపిపి అధ్యక్షులు, తహసీల్దార్‌లను గిరిజనులు వనతి చేశారు. కార్యక్రమంలో చలేపల్లి తండా సుధాకర్ జాదవ్, ప్రేమ్‌సింగ్, శివాజీ రాథోడ్, వనంలపిలన తండా సుభాష్ భానోత్, అఖిల్ రాథోడ్, గణేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**ఉమ్మడి వెల్దుర్తి మండలంలో...**

**వెల్దుర్తి, ఫిబ్రవరి15 ప్రభాతవార్త:** ఉమ్మడి వెల్దుర్తి మండలంలో గురువారం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాసాయిపేట మండలంలోని రామాంతాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తండాలో నూతనంగా నిర్మించి దేవాలయంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కొల్చారం మండలంలో...**

**కొల్చారం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** సమాజ శ్రేయస్సు కోసం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గం ఆదర్శనీయమని జెడ్పీటీసీ ముత్యంగారి మేఘామలసంతోష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వరిగుంతం వరిగుంతం గ్రామంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. వరిగుంతం గ్రామంలో సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేఘమాల సంతోష్ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్, భవాని మాతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొల్చారం మండల వ్యాప్తంగా గురువారం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను వివిధ తండాలలో ఘనంగా నిర్వహించారు.

## రైస్‌మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే

**కొల్చారం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** రైతులసంక్షేమానికి తోడ్పడుతూ లక్ష్మీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ దిన దిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కోనాపూర్ సమీపంలో లక్ష్మీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును నర్సాపూర్ ఎమ్మెల్యే వాటికి సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి రైస్‌మిల్లు యజమాని మన్నాన్పల్లి వెంకటేశం గుప్తాతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంత రైతులు లక్ష్మీవెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలను రైస్‌మిల్లు యజమాని వెంకటేశంగుప్తా, సంగమేశ్వర్, వేణుగోపాల్, రాము, విష్ణువర్ధన్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్ గుప్త, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్‌రావు, మాజీ జెడ్పీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, వై. మాందాపూర్ మాజీ సర్పంచి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచి కన్నారం రమేష్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథోత్సవం..

**వెల్దుర్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ వద్ద వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో గత రెండు రోజులుగా వార్షికోత్సవ వేడుకలను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం రథోత్సవం సందర్భంగా భక్తులు భారీగా పాల్గొన్నారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్‌డీవై కాలనీలో బోరు వేయించిన ఎమ్మెల్యే రోహిత్

**మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** రానున్న వేసవి కాలంలో నీటి సమస్య నెలకొనకుండా పట్టణంలోని ఎన్‌డీవై కాలనీలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఎంఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం బోరు వేయించారు. ఈ సందర్భంగా కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ కాలనీలో నీటి సమస్య లేకుండా ముందస్తుగా బోరు వేయించిన ఎమ్మెల్యే రోహిత్‌కు, ఎంఎస్ఎస్‌వో సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో బోరే వేయించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్ రణదివే, ఉపాధ్యక్షులు నవీన్‌గౌడ్, రాజయ్య, గోపాల్, కోశాధికారి భూపతిగౌడ్, కమిటీ సభ్యులతో తొడంగుల మాణిక్యం, దత్తాత్రేయ కులకర్ణి, నర్సింహారావు, మురళి, సంతోష్, వినయ్, ప్రభాకర్‌రెడ్డి, బేతయ్య, సాయి, హిత, రమాదేవి, ప్రేమ్ ఉమార్, అన్నసాగర్, సాయికుమార్ పాల్గొన్నారు.

## ములుగు నూతన ఎంపిడిఓగా వెంకట శ్రీరామకృష్ణశర్మ

**ములుగు, ఫిబ్రవరి 15 (ప్రభాతవార్త):**

ములుగు ఎంపిడిఓగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌రెడ్డి బదిలీపై మెదక్ జిల్లా తూప్రాన్ మండలానికి బదిలీ కావడంతో నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలో ఎంపిడిఓగా పనిచేసిన వెంకటశ్రీరామకృష్ణశర్మ బదిలీపై ములుగు మండలానికి వచ్చారు. గురువారం ములుగు ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకట శ్రీరామకృష్ణశర్మను స్థానిక కెబిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ఎంపిడిఓ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ నరసింహారావు, రామచందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఓ వెంకట శ్రీరామకృష్ణ శర్మను సన్మానిస్తున్న కొన్యాల బాల్‌రెడ్డి



సేవాలాల్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు...

**నిజాంపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** నిజాంపేట మండల వ్యాప్తంగా గురువారం సేవాలాల్ 285వ జయంతి వేడుకలను గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల వ్యాప్తంగా అన్ని తండాలలోని గిరిజనులు కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జడ్చర్ల తండాలో గల సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని మెదక్ మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంతవరకు ప్రజాసేవయే తన బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, విప్లవకుమార్, నసీరుద్దీన్, మారుతి, వినోద్‌కుమార్, సేనాపతి, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న గిరిజనుల సంప్రదాయ నృత్యాలు...



అల్లాదుర్గం ఐబి చౌరస్తా వద్ద గిరిజనులు నృత్యాలు చేస్తున్న దృశ్యం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మండలంలో గురువారం సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలను గిరిజనులు సాంప్రదాయబద్దంగా జరుపుకున్నారు. సేవాలాల్ మహారాజ్, జగదంబా మాత ఆలయాల్లో భోగ్ భండార్ కార్యక్రమం నిర్వహించారు. సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడంతోపాటు వేడుకలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహించడంపట్ల గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీజే పాటలపై గిరిజనులు నృత్యాలు చేస్తూ జయంతి ఉత్సవాలను ఆనందోత్సవాలతో, భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై విద్యా బోధన చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా యాదగిరి, ఎంఈవోగా అజయ్, ఉపాధ్యాయులుగా మురారి, సాయి, నరసింహాగౌడ్, సుస్మిత, శివలీల, మమత, సౌమ్యలు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రసూన, ఉపాధ్యాయులు శేఖర్ గౌడ్, శ్రీనివాస్, పాండురంగం, కిషోర్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



స్వయం పరిపాలన దినోత్సవ దృశ్యం

## విద్యావ్యాప్తికి ఆదర్శ విద్యాలయం కృషి అమోఘం

**-రాష్ట్ర మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** విద్యావ్యాప్తికి ఆదర్శపాఠశాల కృషి అమోఘమని రాష్ట్ర మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ పి రవికుమార్ అన్నారు. పట్టణంలో గ్రీన్ అండ్‌సీడ్ మార్కెంట్ అసోసియేషన్ తరపున ఆదర్శ విద్యాలయం పేరుతో విద్యాసంస్థను ఏర్పాటు చేసి జహీరాబాద్ ప్రాంతంలో విద్యావ్యాప్తికి పాఠశాల కృషి ఎనలేనిదన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని ఆదర్శవిద్యాలయం స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జుబ్లి సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో 1974లో పాఠశాలను అద్దె గదుల్లో స్థాపించి నేడు సొంత భవనాల్లో విద్యను అందిస్తున్నారని గుర్తు చేశారు. పట్టణంలోకి కొందరు వ్యాపారులు నాడు ప్రారంభించిన పాఠశాలలో ఎందరో విద్యావంతులుగా మారి మంచి పొజిషన్‌లో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు నిర్వహించి సంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల కమిటి సభ్యులందరికి కమిటి అధ్యక్షులు కల్వ చంద్రశేఖర్ శాలువాలతో సత్కరించి మెమొంటోలను బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుల, ది గ్రీన్ అండ్ సీడ్ మర్చంట్ కమిటి సభ్యులు, పూర్వ కమిటి సభ్యులు, ప్రిన్సిపాల్ పద్మావతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జిగా మూలిగ మల్లికార్జున్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** జహీరాబాద్ అసెంబ్లి యూత్ కాంగ్రెస్ ఇంచార్జిగా మూల్గి మల్లికార్జున్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానంపై కాంగ్రెస్ జండా రెపరెపలాడేలా కృషి సల్పుతానన్నారు. తనపై నమ్మకంగా అసెంబ్లి బాధ్యతలు అప్పగించిన యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బివి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డి, రాష్ట్ర ఇంచార్జి సురభి దివేది, నేషనల్ కో-ఆర్డినేటర్ మహేష్ దేశ్‌ముఖ్, పార్లమెంట్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ జెట్టి గీతారెడ్డి, డాక్టర్ ఏ చంద్రశేఖర్, కో-ఆర్డినేటర్, ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, రాష్ట ఉపాధ్యక్షులు రామ్మూర్తి గోపి, నల్ల ప్రతాప్‌రెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ అందుబాటులో ఉంటూ పార్టీ జండా ఎగిరేలా అందిరితో కలిసి కృషి చేస్తానన్నారు.

## బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు సన్మానం

**నిజాంపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో జగదీశ్వర్ చారికి వీడ్కోలు ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం నిర్వహించి శాలువాతో సన్మానించారు. అనంతరం నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రాజిరెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జగదీశ్వర్ చారి మాట్లాడుతూ పదవిలో నాకు సహకరించిన తోటిసిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ రాములు, ఎంపీఓ రాజేందర్, మాజీ సర్పంచులు అమరసేనారెడ్డి, నరసింహారెడ్డి, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, ఏఈ శరత్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పేద జంటకు వివాహం

**రామాయంపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** పట్టణ పరిధిలోని గొలిపర్తి ఎక్స్‌రోడ్డు వద్ద శ్రీభవాని శంకరనగరం అన్నప్రసాద వితరణ క్షేత్రంలో పేద వధూవరులకు వివాహం జరిపించారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన రేఖశ్రీ మేడ్చల్ జిల్లా కొంపల్లికి చెందిన రాఘవేంద్ర రాజులకు వివాహం జరిపించారు. అనంతరం శ్రీ భవాని శంకర అన్నప్రసాద క్షేత్రం ట్రస్టు నిర్వాహకులు నాగభూషణంచారి మాట్లాడుతూ ఈ ట్రస్టు ఆధ్వర్యంలో పేద వధూవరులకు వివాహం జరిపినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో నిరుపేద వధూవరులు ఎవరైనా ఉంటే వారికి తల్లిదండ్రులు లేక తండ్రి ఉండి తల్లిలేక ఉన్నటువంటి నిరుపేద వధువులకు సొంత ఖర్చులతో ఉచిత వివాహాలు జరిపించి అన్ని విధాల ఆదుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం అందరికీ అన్నదానం చేశారు.

## వెల్దుర్తి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన జగదీశ్వరచారి

**వెల్దుర్తి, ఫిబ్రవరి15 ప్రభాతవార్త:** వెల్దుర్తి ఎంపీడీవోగా జగదీశ్వరచారి గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవో పనిచేసిన వెంకటలక్ష్మమ్మ సిద్దిపేటకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన జగదీశ్వరచారి మాట్లాడుతూ గత ఎన్నికల కంటే ముందే ఇక్కడే ఎంపీడీవోగా పనిచేశానని, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.